


మనం
కడప | అన్నమయ్య

కడప మేయర్‌గా ఎన్నికైన మట్లి సువర్ణను సత్కరించిన టిడిపి నాయకులు



ఒంటిమిట్ట నవంబర్ 4(మనం న్యూస్) కడప మేయర్‌గా ఎన్నికైన మట్లి సువర్ణను, ఆమె భర్త డాక్టర్ నేలటూరు మధుసూదన్ రెడ్డిని బుధవారం రాత్రి కడపలో మేయర్ స్వగృహంలో ఒంటిమిట్ట మండల టిడిపి నాయకులు శాలువ కప్పి గజమాలు వేసి ఘనంగా సన్మానించారు. తెలుగుదేశం పార్టీ రాజకీయ చరిత్రలో అత్యధిక మెజార్టీతో మేయర్గా ఎంపికైన సువర్ణ మంచి పరిపాలన అందించి వైయస్సార్సీపి నాయకుల పాలనా శైలికి భిన్నంగా ప్రజలకు అందుబాటులో ఉండి. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఒంటిమిట్ట మండల టిడిపి సీనియర్ నాయకులు కొమర వెంకట నరసయ్య మామిళ్ల ఈశ్వరయ్య తదితరులు ఆమెకు సూచించారు. మేయర్ ఎన్నికల్లో మొదటి నుంచి తమకు అన్ని విధాల అందుబాటులో ఉండి సహకరించిన ఒంటిమిట్ట మండల నాయకుల కు డాక్టర్ మధుసూదన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి పామూరు సుబ్రహ్మణ్యం ఎంపిటిసి పిడుగు సుబ్బారెడ్డి ఎంఆర్ఎఫ్ శివప్రసాద్ రెడ్డి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పల్లె పోరుకు వేళాయె.. ఓటరు తీర్పుపై ఉత్కంఠ!

నేడు పల్లె పోలింగ్
21 మండలాలు.. 599 పోలింగ్ కేంద్రాలు..
మూడు రకాల రాజకీయ ముఖచిత్రాలు
ఏకగ్రీవాల జోరు ఒకవైపు.. ప్రత్యక్ష సమరం మరోవైపు
కూటమికి ప్రతిష్ఠాత్మకం.. వైసీపీకి ఉనికి చాటుకునే అవకాశం!

మనం ప్రతినిధి కడప నవంబర్ 4

“”వైఎస్సార్ కడప జిల్లాలో గ్రామీణ ప్రజాస్వామ్య సమరానికి తెరలేవనుంది. ఏకగ్రీవాల హవా ముగిసిన నేపథ్యంలో మిగిలిన స్థానాల్లో ఓటరు తీర్పు కోసం రాజకీయ పార్టీలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నాయి. జిల్లాలోని 21 మండలాల పరిధిలో 599 పోలింగ్ కేంద్రాల్లో జరిగే ఎన్నికలు స్థానిక రాజకీయాలకు కీలక పరీక్షగా మారాయి. గ్రామ కూడళ్ల నుంచి మండల కేంద్రాల వరకు ఎక్కడ చూసినా ఎన్నికల చర్చలే వినిపిస్తున్నాయి. అభ్యర్థుల వ్యక్తిగత పలుకుబడి, స్థానిక నాయకుల పట్టుదల, సామాజిక సమీకరణాలు, పార్టీల పట్ల ప్రజల్లో ఉన్న అభిప్రాయాలు ఓటింగ్ సరళిని ప్రభావితం చేయనున్నాయి.

ఈ ఎన్నికల్లో జిల్లా రాజకీయ ముఖచిత్రం మూడు విభిన్న కోణాల్లో కనిపిస్తోంది. ఏడు మండలాల్లో ఎంపీటీసీ స్థానాలన్నీ ఏకగ్రీవం కావడంతో జడ్పీటీసీ స్థానాలకే పోలింగ్ జరగనుంది. మరో ఐదు మండలాల్లో జడ్పీటీసీ స్థానాలు ఏకగ్రీవం కాగా, ఎంపీటీసీ స్థానాల్లో పోటీ కొనసాగుతోంది. మిగిలిన తొమ్మిది మండలాల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు ప్రత్యక్ష పోరు నెలకొంది. దీంతో ఎక్కడో మండల స్థాయి నాయకత్వ బలపరీక్ష.. మరెక్కడో గ్రామస్థాయి రాజకీయ ఆధిపత్య పోరు.. ఇంకొన్ని చోట్ల రెండు స్థాయిల్లోనూ పార్టీల ప్రతిష్ఠకు సంబంధించిన సమరం కనిపిస్తోంది.

రాజకీయంగా ఈ ఎన్నికలు అధికార కూటమికి గ్రామస్థాయిలో తన బలాన్ని నిరూపించుకునే అవకాశమైతే, ప్రతిపక్ష వైసీపీకి క్షేత్రస్థాయిలో తన ఉనికిని, కార్యకర్తల పట్టును చాటుకునే పరీక్షగా మారాయి. గత ఎన్నికల ప్రభావం, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, స్థానిక నాయకుల సమన్వయం, ప్రజా సమస్యలపై అభ్యర్థుల స్పందన ఫలితాలను ప్రభావితం చేయనున్నాయి. ఏకగ్రీవాలను తమ విజయంగా భావిస్తున్న పార్టీలకు ప్రత్యక్ష ఎన్నికల్లోనూ అదే ఆధిక్యం కొనసాగించడం సవాలుగా మారింది. మరోవైపు ప్రజా తీర్పు ఎవరికి అనుకూలంగా ఉంటుందన్న ఆసక్తి రాజకీయ వర్గాల్లో నెలకొంది.””

ఏడు మండలాల్లో జడ్పీటీసీకే పోరు

పులివెందుల, వేముల, చక్రాయపేట, తొండూరు, సింహాద్రిపురం, లింగాల, పెండ్లిమర్రి మండలాల్లో ఎంపీటీసీ స్థానాలన్నీ ఏకగ్రీవమయ్యాయి. దీంతో ఈ ఏడు మండలాల్లో జడ్పీటీసీ స్థానాలకే ఎన్నికలు జరగనున్నాయి. ఇక్కడ ప్రధాన పార్టీల నాయకత్వ బలం, నియోజకవర్గ స్థాయి నేతల ప్రభావం, గ్రామాల్లో అభ్యర్థులకు ఉన్న ఆదరణ కీలకం కానున్నాయి. ముఖ్యంగా పులివెందుల ప్రాంతంలో జరిగే పోరు రాజకీయంగా ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుంది.

ఐదు మండలాల్లో ఎంపీటీసీ స్థానాలే కీలకం

వేంపల్లి, వీరపునాయునిపల్లె, కమలాపురం, యర్రగుంట్ల, ముద్దనూరు మండలాల్లో జడ్పీటీసీ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. అయితే కొన్ని ఎంపీటీసీ స్థానాల్లో ప్రత్యక్ష పోటీ కొనసాగుతోంది. జడ్పీటీసీ ఎన్నికల సందడి లేకపోయినా గ్రామస్థాయిలో మాత్రం రాజకీయ వేడి తగ్గలేదు. స్థానిక అభ్యర్థుల మధ్య పోటీ, గ్రామాల్లో పార్టీల పట్టును నిరూపించుకునే ప్రయత్నాలు ఈ మండలాల ఎన్నికలను ఆసక్తికరంగా మార్చాయి.

తొమ్మిది మండలాల్లో హోరాహోరీ సమరం

కడప గ్రామీణ, చెన్నూరు, వల్లూరు, ఖాజీపేట, సిద్ధవటం, ఒంటిమిట్ట, ప్రొద్దుటూరు రూరల్, జమ్మలమడుగు రూరల్, చాపాడు/మైదుకూరు రూరల్ మండలాల్లో జడ్పీటీసీతో పాటు ఎంపీటీసీ స్థానాల్లోనూ పోటీ నెలకొంది. ఇక్కడ రెండు స్థాయిల్లోనూ రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల గెలుపు కోసం వ్యూహాలు అమలు చేశాయి. స్థానిక నాయకుల ప్రతిష్ఠ, కార్యకర్తల సమన్వయం, ఓటర్ల మద్దతు ఎవరికి ఎంత ఉందో ఈ ఎన్నికలు తేల్చనున్నాయి.

ఏకగ్రీవాల వెనుక వ్యూహాలెన్ని?

ఏకగ్రీవాల సాధన వెనుక రాజకీయ చర్చలు, స్థానిక సమీకరణాలు, నాయకుల మధ్య అవగాహనలు కీలకంగా పనిచేసి ఉండవచ్చు. అయితే ఏకగ్రీవ స్థానాల్లో కనిపించిన రాజకీయ ఆధిక్యం పోలింగ్ జరిగే ప్రాంతాల్లోనూ కొనసాగుతుందా అన్నది ఆసక్తికరంగా మారింది. ఏకగ్రీవాలను మాత్రమే రాజకీయ విజయానికి కొలమానంగా చూడలేమని, ప్రత్యక్ష ఎన్నికల్లో వచ్చే ఓట్లే పార్టీల వాస్తవ ప్రజాదరణను ప్రతిబింబిస్తాయని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

కూటమికి ప్రతిష్ఠ.. వైసీపీకి ఉనికి పరీక్ష


రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి పార్టీలు గ్రామస్థాయిలో తమ రాజకీయ పునాదిని మరింత బలోపేతం చేసుకోవాలని చూస్తున్నాయి. మరోవైపు వైసీపీ తనకు పట్టున్న ప్రాంతాల్లో విజయాలు సాధించి కార్యకర్తల్లో ఉత్సాహం నింపాలని ప్రయత్నిస్తోంది. ముఖ్యంగా గతంలో బలంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యర్థులకు ఎంతవరకు పోటీ ఇవ్వగలదన్నది ఆ పార్టీకి కీలకం. స్థానిక నాయకుల మధ్య సమన్వయం, వర్గ విభేదాలు, అభ్యర్థుల ఎంపిక కూడా ఫలితాలపై ప్రభావం చూపే అవకాశముంది.

599 కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి పర్యవేక్షణలో ఎన్నికల యంత్రాంగం ఏర్పాట్లు చేపట్టింది. 21 మండలాల పరిధిలోని 599 పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు భద్రతా చర్యలు చేపట్టారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. అవసరమైన చోట్ల వెబ్‌కాస్టింగ్, వీడియో చిత్రీకరణ, సూక్ష్మ పరిశీలకుల పర్యవేక్షణతో పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

45 ఏళ్ల విజయం..

ఐదేళ్ల పాలనకు అసలైన పరీక్ష!
ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే కూటమి ముందున్న సవాల్
అభివృద్ధి, సంక్షేమమే ప్రాధాన్యాలుగా పనిచేయాలి
26 మంది కౌన్సిలర్లకు చమర్తి దిశానిర్దేశం



మనం ప్రతినిధి రాజంపేట నవంబర్ 4

: నాలుగున్నర దశాబ్దాల రాజకీయ నిరీక్షణకు తెరదించుతూ రాజంపేట పురపాలక పీఠాన్ని కైవసం చేసుకున్న తెలుగుదేశం పార్టీకి ఇప్పుడు అసలైన పరీక్ష మొదలైంది. ఎన్నికల్లో సాధించిన విజయం ఒక ఎత్తయితే.. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపించడం మరో ఎత్తు. 45 ఏళ్ల తర్వాత దక్కిన అవకాశాన్ని ప్రజలకు మెరుగైన పాలన అందించే దిశగా మలచుకోవాల్సిన బాధ్యత నూతన ప్రజాప్రతినిధులపై ఉంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, పట్టణ ప్రజలు ఎదురుచూస్తున్న మౌలిక వసతులు, దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం ఇప్పుడు పాలకవర్గం పనితీరుకు గీటురాయిగా మారనున్నాయి.

ఈ నేపథ్యంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్ రాజు ఎన్నికైన కౌన్సిలర్లకు చేసిన దిశానిర్దేశం ప్రాధాన్యం సంతరించుకుంది. గెలుపును తలకెక్కించుకోకుండా ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. బుధవారం రాజంపేటలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నికైన చైర్‌పర్సన్ డాక్టర్ దొంతం గాయత్రిని సత్కరించి అభినందించారు. ఆమెతో పాటు విజయం సాధించిన 26 మంది కూటమి కౌన్సిలర్లకు అధికారిక డిక్లరేషన్ పత్రాలను అందజేశారు. రాజకీయ విజయాన్ని అభివృద్ధి, సంక్షేమ ఫలితాలుగా మార్చాలని స్పష్టం చేశారు.

పట్టణ ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిల బెట్టుకోవాలంటే మాటలకంటే చేతల్లో పనితీరు చూపాల్సి ఉంటుంది. ప్రతి వార్డులో సమస్యలను గుర్తించడం, వాటి పరిష్కారానికి ప్రణాళికలు రూపొందిం చడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు చేరేలా చూడటం వంటి అంశాలపై పాలకవర్గం ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది. సమష్టి నిర్ణయాలు, అధికారులతో సమన్వయం, ప్రజలకు జవాబుదారీతనం వంటి అంశాలే రాజంపేట పురపాలక పాలనకు దిశానిర్దేశం చేయనున్నాయి.””

మౌలిక వసతులే తొలి ప్రాధాన్యం
వార్డుల వారీగా సమస్యల గుర్తింపు..
పరిష్కారానికి కార్యాచరణ

రాజంపేట పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, అంతర్గత రహదారులు, వీధి దీపాలు వంటి మౌలిక సమస్యల పరిష్కారం అత్యంత కీలకం. ప్రతి కౌన్సిలర్ తమ వార్డులోని పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రాధాన్య క్రమంలో పనులు చేపట్టేలా చూరవ చూపాలి. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు సత్వర స్పందన ఉండాలి. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడమే కాకుండా అవి పరిష్కారమయ్యే వరకు పర్యవేక్షించాల్సిన బాధ్యత కూడా ప్రజాప్రతినిధులపై ఉంటుంది.

సంక్షేమ పథకాలు అర్హులకు చేరేనా?
పేద, మధ్యతరగతి కుటుంబాల అవసరాలపై దృష్టి

పట్టణంలోని అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కౌన్సిలర్లు చొరవ చూపాల్సి ఉంది. పింఛన్లు, గృహ నిర్మాణం, ఇతర సంక్షేమ కార్యక్రమాల అమలులో అర్హత కలిగిన వారు ఇబ్బందులు పడకుండా చూడాలి. ప్రజల అవసరాలను గుర్తించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలి. సంక్షేమ ఫలాలు క్షేత్రస్థాయిలో అందినప్పుడే ప్రజల్లో పాలకవర్గంపై విశ్వాసం మరింత బలపడుతుంది.

చమర్తి దిశానిర్దేశం
గెలుపు గర్వం వద్దు.. బాధ్యతతో పనిచేయండి

45 ఏళ్ల తర్వాత రాజంపేట పురపాలక పీఠంపై టీడీపీ జెండా ఎగరడం గొప్ప విజయమని చమర్తి జగన్‌మోహన్ రాజు పేర్కొన్నారు. అయితే ఈ గెలుపును ఎవరూ తలకెక్కించుకోకుండా మరింత బాధ్యతతో పనిచేయాలని సూచించారు.

ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, ఇతర మౌలిక సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ప్రజల ఆదరాభిమానాలను ఎప్పటికీ మర్చిపోకూడదని, పార్టీ విజయపరంపర కొనసాగించేలా ప్రజాసేవలో ముందుండాలని పిలుపునిచ్చారు.

సమష్టి కృషితో పట్టణ ప్రగతి
కౌన్సిలర్లతో సమన్వయమే కీలకం

చైర్‌పర్సన్ డాక్టర్ దొంతం గాయత్రి మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేతలకు, చమర్తి జగన్‌మోహన్ రాజుకు, సీనియర్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కౌన్సిలర్లందరినీ సమన్వయం చేసుకుంటూ రాజంపేట పట్టణ సర్వతోముఖాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని వెల్లడించారు. ఈ విజయానికి కృషి చేసిన కూటమి నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ అభ్యర్థి, టీడీపీ పార్లమెంట్ అధికార ప్రతినిధి దొంతం శివప్రసాద్, క్లస్టర్ ఇన్‌చార్జులు కొల్లి రెడ్డయ్య, షేక్ కరీం, సీనియర్ నాయకులు డాక్టర్ సుధాకర్, లక్ష్మీనారాయణ, సంజీవ్ నాయుడు, గుగ్గిళ్ల చంద్రమౌళి, డాక్టర్ నవీన్, మనుబోలు వెంకటేశ్వర్లు, తుపాకుల అశోక్, రామ్‌నగర్ నరసింహ, సమీర్ భాష, చిన్నా, ఎన్నికైన కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



పిచ్చి మొక్కల మధ్య ప్రాథమిక ఆరోగ్య కేంద్రం!

ముద్దనూరు, నవంబర్ 04 (మనం న్యూస్): ప్రజలకు వైద్య సేవలందిస్తూ ఆరోగ్యంపై అవగాహన కల్పించాల్సిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాలే అపరిశుభ్రతకు అద్దం పడుతున్నాయి. ఆసుపత్రి ప్రాంగణంలో పిచ్చి మొక్కలు, కంప చెట్లు విస్తారంగా పెరిగి ఉండటంతో పరిసరాలు అధ్వానంగా మారాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులు ఈ పరిస్థితుల కారణంగా అసౌకర్యానికి గురవుతున్నారని చెబుతున్నారు. ప్రాంగణంలోకి వీధి కుక్కలు ప్రవేశించి అక్కడే పడుకుని ఉండటంతో రోగులు భయాందోళనకు గురవుతు న్నారు. ఎప్పుడు కుక్కలు దాడి చేస్తాయోనని ఆందోళన చెందుతున్నా మని పలువురు పేర్కొంటున్నారు. ఆసుపత్రి పరిసరాలను నిత్యం శుభ్రం చేయడంతో పాటు పిచ్చి మొక్క లను తొలగించి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత సంబంధిత సిబ్బందిపై ఉన్నప్పటికీ, ఆ దిశగా తగిన చర్యలు కనిపించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. పరిసరాల అపరిశుభ్రత వల్ల దోమలు, విషపురుగులు పెరిగే అవకాశం ఉందని, ఇది రోగుల ఆరోగ్యానికి మరింత ముప్పుగా పరిణమించవచ్చని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు పరిశుభ్రతపై సూచనలు చేసే వైద్య ఆరోగ్య శాఖ తమ పరిధిలోని ఆసుపత్రి ప్రాంగణాన్ని సైతం పరిశుభ్రంగా ఉంచడంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ప్రాంగణాన్ని శుభ్రం చేయించి, వీధి కుక్కల బెడదను నివారించడంతో పాటు పారిశుద్ధ్య నిర్వహణ నిరంతరం కొనసాగేలా చర్యలు తీసుకోవాలని రోగులు, స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

జెఎన్టీయుఏ సౌత్ జోన్ చెస్ పోటీలకు ఎంపికైన గౌతమి విద్యార్థిని

ప్రొద్దుటూరు నవంబర్ 4 మనం న్యూస్ : ప్రొద్దుటూరు గౌతమి ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్ మెంట్ ఫర్ ఉమెన్ (అటానమస్) కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న కె అమృత లక్ష్మి ఈఈఈ విద్యార్థిని జెఎన్టీయుఏ సౌత్ జోన్ చెస్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. ఈ నెల 9 నుం డి 12 వరకు హైదరాబాద్ లో జరిగే అంతర్ విశ్వవిద్యా లయాల సౌత్ జోన్ చెస్ పోటీలలో ఆమె పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్లు సి. నాగూర్, బి. రవీంద్రా రెడ్డి, కరస్పాం డెంట్ కె.సి. బాబమ్మ, డైరెక్టర్ సి. శైలూష, ప్రిన్సిపాల్ డా. ఎం. రామ సుబ్బమ్మ, ఫిజికల్ డైరెక్టర్ జి. ఓబయ్య మరియు జి. ప్రవల్లిక విద్యా ర్థినిని అభినందించారు. విద్యార్థినులు విద్య తో పాటు క్రీడల్లో కూడా ప్రతిభ కనబరచడం గర్వకారణమని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి కళాశాలకు మం చి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

47 పోలింగ్ కేంద్రాలు..
150 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు
282 మంది సిబ్బందితో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం



చిట్వేలి నవంబర్ 4 మనం న్యూస్: ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు చిట్వేలీ మండలంలో పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టినట్లు రిటర్నింగ్ అధికారి జయభారత్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలో మొత్తం 47 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఎన్నికల విధుల నిర్వహణ కోసం 282 మంది సిబ్బందిని నియమించడంతో పాటు, భద్రతా చర్యల్లో భాగంగా 150 మంది పోలీసు సిబ్బందిని మోహరించనున్నట్లు పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఓటర్లు స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని రిటర్నింగ్ అధికారి జయ భరత్ రెడ్డి వివరించారు.

బ్రిక్స్ సుస్థిర జీవనశైలి 2026 వారోత్సవాలు


ప్రొద్దుటూరు నవంబర్ 4 మనం న్యూస్ : బ్రిక్స్ సుస్థజీవనశైలి 2026 వారోత్సవాల సందర్భంగా బుధవారం ప్రొద్దుటూరు డిపో గ్యారేజీ ఎమ్ ఎఫ్ రూమ్ నందు డిపో సిబ్బందికి ప్రముఖ న్యూట్రీషియన్ ప్రవీణ్ ఆరోగ్యం గురించి సలహాలు మరియు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ గంగాధర్ తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



మున్సిపల్ చరిత్రలో ఎస్సీలకు అందని వైస్ చైర్మన్ పీఠం..
రాబోయే పాలకమండలిలో 'తలారి పుల్లయ్య'కు అవకాశం దక్కేనా?

ప్రొద్దుటూరు మనం న్యూస్: నవంబర్ (04):

రాయలసీమలోనే కీలకమైన వ్యాపార, రాజకీయ కేంద్రంగా గుర్తింపు పొందిన ప్రొద్దుటూరు పురపాలక సంఘంలో త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల వేళ ఆసక్తికరమైన చర్చ మొదలైంది. ప్రొద్దుటూరు మున్సిపాలిటీ ఆవిర్భవించిన నాటి నుండి నేటి వరకు అనేకమంది ఎస్సీ నాయకులు వార్డు కౌన్సిలర్లుగా గెలిచి తమ సేవలు అందించినప్పటికీ, మున్సిపల్ చైర్మన్ లేదా వైస్ చైర్మన్ వంటి కీలకమైన పదవుల్లో ఎస్సీ వర్గాలకు అవకాశం దక్కకపోవడం గమనార్హం. అనేక దశాబ్దాలుగా రాజకీయ పార్టీలు ఈ వర్గానికి ఉన్నత పదవుల్లో భాగస్వామ్యం కల్పించకపోవడంపై ఎస్సీ సామాజిక వర్గాల్లో కొంత అసంతృప్తి నివురుగప్పిన నిప్పులా ఉంటూ వచ్చింది. ఈ నేపథ్యంలో, 2026 మున్సిపల్ ఎన్నికల అనంతరం కొలువుతీరబోయే నూతన పాలకమండలిలో నైనా వైస్ చైర్మన్ పదవి ఎస్సీలకు కేటాయిస్తారా? అలా కేటాయిస్తే ఆ అవకాశం రెండుసార్లు కౌన్సిలర్‌గా పనిచేసిన సీనియర్ నాయకుడు తలారి పుల్లయ్యకు దక్కుతుందా? అనే అంశంపై పట్టణంలో విస్తృత చర్చ జరుగుతోంది. తలారి పుల్లయ్య రాజకీయ ప్రస్థానం మొదటి నుండి స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి నాయకత్వంలోనే సాగింది. రాజకీయాల్లోకి ప్రవేశించిన తొలి నాళ్ల నుండి నేటి వరకు ఆయన 'వరద' వర్గంలోనే కొనసాగుతూ, పార్టీ పట్ల మరియు నాయకుడి పట్ల అచంచల మైన విశ్వాసాన్ని కనబరిచారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతా నికి, అలాగే స్థానిక సమస్యల పరిష్కారానికి ఆయన అందించిన సేవలు నాయకత్వ గుర్తింపును పొందాయి. వరదరాజుల రెడ్డికి అత్యంత నమ్మకస్తుడిగా పేరుపొందిన పుల్లయ్య, రెండుసార్లు మున్సిపల్ కౌన్సిలర్‌గా గెలిచి తన వార్డు పరిధిలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.



మున్సిపల్ చరిత్రలో ఇప్పటివరకు ఎస్సీ వర్గానికి వైస్ చైర్మన్ పీఠం దక్కపోవడంపై తెలుగుదేశం పార్టీ అధిష్టానం మరియు స్థానిక నాయకత్వం కూడా సానుకూలంగా ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఈసారి ఎలాగైనా ఎస్సీలకు ఆ గౌరవం కల్పించి, సామాజిక న్యాయానికి పెద్దపీట వేయాలన్న ఉద్దేశంతో టీడీపీ నాయకులు ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఒకవేళ పార్టీ నిర్ణయం ప్రకారం ఎస్సీ కేటగిరీకి వైస్ చైర్మన్ పదవి కేటాయిస్తే, ఆ రేసులో అందరికంటే ముందు వరుసలో తలారి పుల్లయ్య పేరు నిలుస్తుందని పలువురు విశ్లేషిస్తున్నారు.

పట్టణంలోని ఎస్సీ సామాజిక వర్గాలు కూడా ఈ ప్రతిపాదనను స్వాగతిస్తున్నాయి. "మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుండి కౌన్సిలర్లుగానే మిగిలిపోతున్నాం, ఒక్కసారైనా వైస్ చైర్మన్ వంటి కీలక పదవి ఎస్సీలకు కేటాయించి చరిత్ర తిరగరాయాలి" అని ఎస్సీ సంఘాల నాయకులు మరియు స్థానిక ప్రజలు గట్టిగా కోరుతున్నారు. ?సుదీర్ఘ రాజకీయ అనుభవం, రెండుసార్లు కౌన్సిలర్‌గా పనిచేసిన అనుభవం, మరియు ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డికి ఉన్న నమ్మకమైన అనుచరుడిగా ఉన్న తలారి పుల్లయ్యకు వైస్ చైర్మన్ పీఠం దక్కితే అది ఎస్సీ వర్గాలకు దక్కే గొప్ప గౌరవంగా భావిస్తున్నారు. నూతన పాలకమండలి ఏర్పాటు సమయంలో రాజకీయ సమీకరణలు ఏ మలుపు తిరుగుతాయో చూడాల్సి ఉంది.

తిరుపతి జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు భారీ భద్రత: 2,617 మంది సిబ్బందితో పటిష్ట బందోబస్తు : ఎస్పీ

రైల్వే కోడూరు, నవంబర్ 4, మనం న్యూస్

తిరుపతి జిల్లా వ్యాప్తంగా జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, నిష్పక్షపాతంగా నిర్వహించేం దుకు పోలీస్ శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్ మాట్లాడుతూ, ఎన్నికల విధుల కోసం మొత్తం 2,617 మంది పోలీస్ అధికారులు మరియు సిబ్బందిని రంగంలోకి దించినట్లు వెల్లడించారు. ఎన్నికల భద్రతా చర్యల్లో భాగంగా ఎస్పీ స్వయంగా కోడూరు, పుల్లంపేట ప్రాంతాలలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి క్షేత్రస్థాయి ఏర్పాట్లను పరిశీలించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, రూట్ మొబైల్స్, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సులను అందుబాటులో ఉంచామని తెలిపారు. విధుల్లో ఉన్న సిబ్బంది పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు



జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద నిబంధనలు కఠినంగా అమలు చేయనున్నట్లు ఎస్పీ స్పష్టం చేశారు. 100 మీటర్ల పరిధిలో ఓటర్లను ప్రభావితం చేసేలా పార్టీ గుర్తులు, కండువాలు, సంజ్ఞలు ప్రదర్శించడం నిరోధించడమే కాకుండా, అనధికారిక వ్యక్తులు గుమిగూడకుండా చర్యలు తీసుకుంటారు. నిషేధిత వస్తువులను పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించరని, పోలింగ్ అధికారి పిలుపు మేరకు తప్ప పోలీస్ సిబ్బంది కేంద్రాల లోపలికి వెళ్లరని తెలిపారు. పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌లకు చేర్చే వరకు కట్టుదిట్టమైన భద్రత కొనసాగుతుంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి నిబంధనలను ఉల్లంఘించి ఓటర్లను బెదిరించినా, ప్రలోభపెట్టినా లేదా సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారాలు వ్యాప్తి చేసినా కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఓటరు ఎలాంటి భయం, ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియో గించుకునేలా పోలీస్ శాఖ పూర్తి భరోసా కల్పిస్తోందని, ప్రజలకు ఏవైనా సమస్యలు ఎదురైతే తక్షణమే పోలీస్ శాఖను సంప్రదించాలని ఎస్పీ సూచించారు.

రైల్వే కోడ్ నియోజకవర్గంలో ఎక్సైజ్ శాఖ ఉక్కుపాదం

8 మంది బైండోవర్, ఇద్దరి అరెస్ట్

రైల్వే కోడూరు, నవంబర్ 4, మనం న్యూస్

స్థానిక సంస్థలైన ఎంపీటీసీ మరియు జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారులు కఠిన చర్యలకు ఉపక్రమించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూసేం దుకు మరియు అసాధారణ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. నిబంధనల ప్రకారం 48 గంటల పాటు 'డ్రై డే' నిబంధన అమల్లో భాగంగా, మండల పరిధిలోని అన్ని మద్యం దుకాణాలను 03.11.2026 తేదీ సాయంత్రం 5:00 గంటల నుండి 05.11.2026 తేదీ సాయంత్రం 5:00 గంటల వరకు పూర్తిగా మూసివేయించారు.ఎన్నికల వేళ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా, ఒబులవారిపల్లి మండల పరిధిలో గతంలో నాటుసారా తయారీ మరియు విక్రయాలకు పాల్పడిన చరిత్ర ఉన్న 8 మంది పాత నేరస్థులను గుర్తించి, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట బైండోవర్ చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రౌడీషీటర్లు, పాత నేరస్థుల కదలికలపై ప్రత్యేక





నిఘా ఉంచినట్లు అధికారులు తెలిపారు.

అదేవిధంగా, ఎన్నికల సందర్భంగా డ్రై డే నిబంధనల అమలును క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు ఎక్సైజ్ సూపరింటెండెంట్ టాస్క్‌ఫోర్స్ బృందం మరియు అన్నమయ్య జిల్లా ఈసీటీఎఫ్ టాస్క్ ఫోర్స్ బృందం రంగంలోకి దిగాయి. ఈ తనిఖీల్లో భాగంగా అక్రమంగా డ్యూటీ పెయిడ్ మద్యం విక్రయిస్తున్న ఒకరిని అదుపులోకి తీసుకుని, అతని నుంచి 14 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. మరోవైపు రైల్వే కోడూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది కూడా నిఘా ఉంచి, అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మరో వ్యక్తిపై కేసు నమోదు చేసి, అతని వద్ద నుంచి 6 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. మొత్తంగా ఈ రెండు వేర్వేరు కేసుల్లో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేయడంతో పాటు 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు. ఎన్నికలు ముగిసే వరకు నాటుసారా మరియు అక్రమ మద్యం విక్రయాలపై ఉక్కుపాదం మోపుతామని, నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని అధికారులు హెచ్చరించారు.

ఎన్నికల వేళ పోలీసులు ప్రత్యేక నిఘా.. అవాంఛనీయ ఘటనలకు తావులేదు

ఒక సీఐ, ముగ్గురు ఎస్ఐలు, 150 మంది పోలీసులతో పటిష్ట భద్రత

చిట్వేలీ నవంబర్ 4 మనం న్యూస్: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో చిట్వేల్ మండలంలో పోలీస్ శాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. నవంబర్ 5వ తేదీ గురువారం జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చిట్వేల్ ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపారు. ఒక సీఐ, ముగ్గురు ఎస్ఐలు, సుమారు 150 మంది పోలీసు సిబ్బందితో భద్రతా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. మండలంలోని అన్ని గ్రామాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఎవరైనా గుంపులుగా చేరడం, గొడవలకు దిగడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు పోలీస్ శాఖకు సహకరించాలని, ఏవైనా సమస్యలు లేదా ఇబ్బందులు తలెత్తితే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఎస్ఐ వినోద్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు తృణధాన్యాల పోషక విలువలపై అవగాహన

ఒంటిమిట్ట, నవంబరు 4 (మనం న్యూస్)

సంప్రదాయ చిరుధాన్యాల ఆహారంతో ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవచ్చని డీఆర్ఓ నాగు నాయక్ పేర్కొన్నారు. బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారోత్సవాలు– 2026లో భాగంగా బుధవారం ఒంటిమిట్టలోని శ్రీ సాయిభారతి ఉన్నత పాఠశాలలో అటవీ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు తృణ ధాన్యాల ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు, సామలు, అరికెలు, ఊదలు తదితర చిరుధాన్యాల్లోని పోషక విలువలు, ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. ఆధునిక ఆహారపు అలవాట్లకు దూరంగా సంప్రదాయ పోషకాహారాన్ని రోజువారీ భోజనంలో భాగం చేసుకోవాలని సూచించారు. నాగు నాయక్ మాట్లాడుతూ.. చిరుధాన్యాలు ఆరోగ్యానికి మేలు చేయడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు, సుస్థిర వ్యవసాయానికి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రామ తులసి, ప్రధానోపాధ్యాయులు సుబ్బరామయ్య, సురేష్, అటవీ శాఖ సిబ్బంది హేమలత, సుబ్బరాయుడు, భార్గవి, బాషా తదితరులు పాల్గొన్నారు.